ఆగిన నాడు-నేడు పనులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పేద విద్యార్థుల చదువులకు పెద్ద పీట వేసింది. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించింది. నాడు–నేడు కింద రూ.కోట్లు ఖర్చు చేసి పాఠశాలలను అభివృద్ధి చేసింది. ఎన్నికల కోడ్ రావడంతో గత ఏడాది పనులు నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం రాజకీయ కక్ష సాధింపులతోపాటు, వైఎస్సార్ సీపీకి పేరు వస్తుందనే నెపంతో నాడు–నేడు పనుల గురించి పట్టించుకోవడం మానేసింది. దీంతో అసంపూర్తి పనుల మధ్య పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు.

- పూర్తికాని నాడు–నేడు పనులు
- విద్యార్థులకు తప్పని కష్టాలు
- గత ప్రభుత్వం నాడు–నేడుతో విప్లవాత్మక మార్పులు
- ప్రస్తుతం నిధులు విడుదల చేయని కూటమి ప్రభుత్వం


దొరవారిసత్రం కేజీబీవీలో అసంపూర్తిగా వున్న తరగతి గదులు

దొరవారిసత్రం: రాష్ట్రంలో 2014–19 మధ్య ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా ఉండేవి. వసతుల లేమితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఉపాధ్యాయలకు ఇతర పనులు కేటాయించడంతో పిల్లలకు సరైన విద్య అందేది కాదు. దీంతో ఎక్కువ మంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి చర్యలు తీసుకుంది. మన బడి నాడు–నేడు పథకం కింద రెండు విడతల్లో ప్రభుత్వ పాఠశాలలను అన్ని వసతులతో అభివృద్ధి చేసింది. సూళ్లూరుపేట నియోజకవర్గంలోని దొరవారిసత్రం, తడ, ఓజిలి, పెళ్లకూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట మండలాల్లో 386 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 276 పాఠశాలలను మన బడి నాడు–నేడు పథకం కింద ఫేజ్ -1, 2 కింద ఎంపిక చేసింది. ఇందుకోసం రూ.85.36 కోట్లు కేటాయించింది. విద్యార్థులు, టీచర్లతోపాటు పాఠశాలల్లో అవసరమైన మరుగుదొడ్లు, నీటి వసతి, అదనపు గదులు, టిజిట్ తరగతులు, విద్యుత్ సదుపాయం, పాఠశాల మరమ్మతులు తదితర పనులు పూర్తి చేసింది. రెండో విడతలో చేపట్టిన నాడు–నేడు పనులకు నిధులు మంజూరై పనులు సగానికి పైగా చేశారు. ఇంతలో ఎన్నికలు వచ్చి కూటమి ప్రభుత్వ ఏర్పడింది. దీంతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి. ఏడాదిగా నిధులు ఇవ్వకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

అసంపూర్తి పనులు

దొరవారిసత్రం కేజీబీవీ, శ్రీధనమల్లి, తల్లంపాడు, ఉచ్చూరు, కల్లూరు జెడ్పీ పాఠశాలలు, అక్కరపాక, నేతాజీనగర్ తదితర ప్రాంతాల్లోని ప్రాథమిక పాఠశాలలు, పెళ్లకూరు మండలంలోని నెలబల్లి జెడ్పీ, ఓజిలి మండలంలోని కురుగుంట, ఆర్మేనిపాడు, అత్తివరం జెడ్పీ పాఠశాలలు, నాయుడుపేట, సూళ్లూరుపేట, తడ మండలాల్లోని పలు పాఠశాలల్లో నాడు–నేడు పనులు అసంపూర్తిగా ఉన్నాయి.

మండలం	స్కూళ్లు	నాడు–నేడు స్కూళ్లు	కేటాయించిన నిధులు	విద్యార్థులు
దొరవారిసత్రం	65	22	రూ.8.11 కోట్లు	3,266
ఓజిలి	61	36	రూ.12 కోట్లు	2,540
సూళ్లూరుపేట	71	58	రూ.14.23 కోట్లు	4,912
పెళ్లకూరు	65	39	రూ.17.97 కోట్లు	3,772
తడ	49	43	రూ11.39 కోట్లు	3,677
నాయుడుపేట	75	69	రూ. 20.66 కోట్లు	3,524


తల్లంపాడు జెడ్పీ పాఠశాలలో ఆగిపోయిన బాలికల మరుగుదొడ్లు


శ్రీధమనల్లి జెడ్పీ పాఠశాలలో అసంపూర్తిగా వున్న వంట గది, మరుగుదొడ్లు


శ్రీధనమల్లి జెడ్పీ పాఠశాల ఆవరణలో పిలర్లు దాటని అదనపు భవన నిర్మాణం

ఆగిన పనులు పూర్తి చేయించాలి



శ్రీధనమల్లి జెడ్పీ పాఠశాలలో ఆగిపోయిన పనులు అన్ని పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలి. ప్రస్తుతం ఉన్న గదులు విద్యార్థులకు సరిపోవడం లేదు. దీంతో పిల్లలను పాఠశాల ఆవరణలో ఉన్న చెట్ల కింద కూర్చోబెడుతున్నారు. పిల్లలు ఇబ్బందులు పడుతూ విద్యను అభ్యసిస్తున్నారు.

–రాజయ్య, శ్రీధనమల్లి గ్రామం

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు



తల్లంపాడు జెడ్పీ పాఠశాలలో నాడు–నేడు కింద గత ప్రభుత్వం చేపట్టిన పనులన్నీ అసంపూర్తిగా నిలిచిపోయాయి. విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం కనీసం విద్యార్థులకు అవసరమైన మరుగుదొడ్లు, వంట గది పనులు పూర్తి చేస్తే బాగుంటుంది.

–సుబ్బమ్మ, తల్లంపాడు గ్రామం

క్లుప్తంగా

దివ్యాంగులకు కూరగాయల పంపిణీ



చిల్లకూరు : గూడూరు పట్టణ, పరిసర ప్రాంతాల్లోని దివ్యాంగులకు ఆదివారం జేవీవీ కార్యాలయంలో కూరగాయలు పంపిణీ చేశారు. రెడ్ సంస్థ సహకారంతో ప్రాస్పరో ఇంగ్లీషు మీడియం స్కూల్ అధినేత దశరథ రామిరెడ్డి దాతృత్వంతో కూరగాయలు, కోడిగుడ్లు అందజేసినట్టు జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ తెలిపారు. దివ్యాంగులు ఆత్మస్థైర్యం కలిగి ఉండాలని సూచించారు. ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. రెడ్ సంస్థ ప్రతినిధి, జానా సుధీర్, జేవీవీ ప్రతినిధులు నాగరాజు, పురుషోత్తమరావు, సుబ్బారావు, ప్రభాకర్, ఇబ్రహీం, అశోక్, శ్రీనివాసులు, రాధయ్య, రజినీకాంత్, శ్రీనివాసాచారి, అరుణ్ పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు న్యాయ సహాయం

వెంకటగిరి రూరల్ : సీనియర్ సిటిజన్లు చట్టపరమైన సమస్యలు ఎదుర్కొంటున్నట్లయితే కోర్టును ఆశ్రయించవచ్చని ప్యానల్ న్యాయవాదులు అద్దంకి గాంధీ, రాజేష్ తెలిపారు. వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి విష్ణువర్మ ఆదేశాల మేరకు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కార్యాలయంలో చట్టాలపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్‌లు సమస్యల పట్ల సతమవుతుంటే కోర్టును ఆశ్రయిస్తే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. నిరాదరణ గురైన వారు భరణం పొందవచ్చని వెల్లడించారు.

భక్తి శ్రద్ధలతో చక్రస్నానం


లక్ష్మీనరసింహస్వామి వారికి చక్రస్నానం చేయిస్తున్న వేద పండితులు

కలువాయి(సైదాపురం) : మండలంలోని రాజుపాళెంలోని పరమానంద ఆశ్రమంలో కొలువైన శ్రీ రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీనరసింహ స్వామి వారికి ఆదివారం చక్రస్నాన ఘట్టాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి వారి శాసనములతో నిర్మితమైన స్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితులు పెన్నానదిలో చక్రస్నానాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు చిన స్వామి మాట్లాడుతూ త్రిదండి చిన్న జీయర్ స్వామి ఆశీస్సులతో బహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించినట్టు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

సైదాపురం : మండల కేంద్రమైన సైదాపురం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం నెల్లూరులోని సుశీల నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. 200 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు, కంటి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బొలిగర్ల శివకుమార్, ఉప సర్పంచ్ శారద, నాయకులు సాంబయ్య యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాం ఆలయంలో ప్రత్యేక పూజలు

చిట్టమూరు : మల్లాం గ్రా మంలో స్వయంభువుగా వెలసిన వల్లీదేవసేన స మేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామి వారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం చే శారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తుల కు దర్శనం కల్పించారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. కుజదోషం ఉన్న వారు హోమాలు చేయించుకున్నారు. మధ్యా హ్నం భక్తులకు అన్నదానం చేశారు.

కండలేరులో 36.955 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 36.955 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి ఈఈ రామచంద్రమూర్తి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,480, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 50, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

కనిపించని బస్ షెల్టర్



సైదాపురం: మండలంలోని పొక్కందలకు వెళ్లే రోడ్డులో నిర్మించిన బస్ షెల్టర్ చుట్టూ ముళ్లపొదలు పెరిగాయి. గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ గ్రామానికి వెళ్లే రోడ్డులో మరో షెల్టర్‌ను ఏర్పాటు చేయడంతో ఈ షెల్టర్‌ను వదిలివేశారు. అధికారులు స్పందించి ముళ్ల చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

అట్రాసిటీ కేసుపై గూడూరు డీఎస్పీ విచారణ


గ్రామంలో విచారణ చేస్తున్న డీఎస్పీ గీతాకుమారి

చిట్టమూరు : కోట మండలం విద్యానగర్‌కు చెందిన మల్లీశ్వరమ్మకు చిట్టమూరు మండలం పెద్ద దరఖాస్తు గ్రామంలో పొలం ఉంది. దాన్ని దరఖాస్తు గ్రామానికి చెందిన కోటపూడి తిరుపాలయ్య లీజుకు తీసుకున్నాడు. ఏప్రిల్ నెలాఖరుకు లీజు నగదు చెల్లించాల్సి వుంది. అతను చెల్లించలేదు. ఈ విషయమై ఇద్ద మధ్య గొడవ జరిగింది. ఈ నెల 9వ తేదీన మల్లీశ్వరమ్మ దరఖాస్తు గ్రామానికి చేరుకుని పెద్ద మనుషులతో కలిసి తిరుపాలయ్యను డబ్బు అడిగింది. అతను సరైన సమాధానం చెప్పకపోవడంతో మల్లీశ్వరమ్మ అతనిపై దాడి చేసింది. దీంతో మల్లీశ్వరమ్మ తనను కులం పేరుతో దూషించి దాడి చేసిందని బాధితుడు ఈ నెల 9వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో డీఎస్పీ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విచారణలో చిట్టమూరు ఎస్ఐ చిన్నబలరామయ్య, పోటీసు సిబ్బంది, వీఆర్వో కోటయ్య ఉన్నారు.

అధ్యాపకులకు ఏఐపై అవగాహన అవసరం


ఏఐ కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించి ప్రారంభిస్తున్న వివిధ కళాశాలల ప్రతినిధులు

చిల్లకూరు : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)పై అధ్యాపకులకు అవగాహన అవసరమని బెంగళూరుకు చెందిన గ్లోబల్ ఫౌండ్రీస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కే వాసుదేవరెడ్డి తెలిపారు. గూడూరు పట్టణ సమీపంలోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడుకు చెందిన సుమారు 60 మంది అధ్యాపకులకు ఆర్టి ఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై అవగాహన, శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టి ఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతల సమన్వయమని, ఇందులో జోడించే అంశాలను విద్యార్థులకు తెలియజేసే ముందు వీఎల్ఎస్ఐ డిజైన్‌పై అధ్యాపకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డాక్టర్ కే హరికిషోర్ మాట్లాడుతూ ఏఐ ఆధారిత లోప నిర్ధారణ, పరీక్షలు, వీఎల్ఎస్ఐ సిస్టమ్ సర్క్యూట్‌లో లోపాలను ఎలా గుర్తించవచ్చో ఏఐలో తెలుస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ రవిప్రసాద్ మాట్లాడుతూ సాంకేతికతల్లో వస్తున్న కొత్త మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు కళాశాలలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ దత్తాత్రేయ, డీన్ విశ్వక్‌సేన్‌రెడ్డి, ఏవో కొండారెడ్డి, వివిధ విభాగాధిపతులు, ప్యాకల్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ పేరుతో కరెంట్ కట్

దొరవారిసత్రం : సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని డీవీ సత్రం, సూళ్లూరుపేట మండలాల్లో నిర్వహణ పేరుతో ఆదివారం రోజంతా విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఉదయం 8 గంటలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రాత్రి 7.40 గంటల వరకు విద్యుత్ రాలేదు. ఇది ఇలా ఉండగా గ్రామీణ ప్రాంతాల్లో నీటి పథకాల మోటార్లకు విద్యుత్ లేకపోవడంతో తాగు నీటికి పడరాని పాట్లు పడ్డారు. గత ప్రభుత్వంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడిన దాఖలాలేవని పలువురు పేర్కొన్నారు.

ఆత్మహత్యకు యత్నించిన యువకుడి మృతి

దొరవారిసత్రం : అనారోగ్యంతో బారిన యువకుడు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు యత్నించిన యువకుడు శనివారం రాత్రి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని వేణుంబాకం ఎస్సీ కాలనీకి చెందిన బాలగున్నయ్య కొడుకు బాలసుబ్రమణ్యం(23) నాలుగేళ్లుగా వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 11న విషం తాగాడు. గమనించిన స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నైలోని సిమ్స్ ఆస్పత్రికి తరలించారు. అతని ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు క్షీణిస్తుండడంతో వైద్యులు శనివారం డిశ్చార్జి చేశారు. రాత్రి ఇంటి వద్ద మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్ఐ అజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవకు ఈకేవైసీ చేసుకోవాలి

కలువాయి(సైదాపురం) : అన్నదాత సుఖీభవ 2025–26 సంవత్సరానికి సంబంధించి రైతులు తప్పని సరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఇన్‌చార్జి వ్యవసాయశాఖ అధికారిణి జ్యోత్స్న తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 9,446 మంది రైతులు ఉండగా ఇందులో 5,274 మంది రైతులు ఈకేవైసీ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు కూడా తమ పరిధిలో ఉన్న రైతు భరోసా కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. తద్వారా అన్నదాత సుఖీభవ తోపాటు పీఎం కిసాన్ పథకాలు వర్తించి ప్రభుత్వ లబ్ధిపొందేందుకు అర్హులవుతారన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు గూడూరు విద్యార్థులు


దీపిక


కౌసల్య

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు దీపిక, కౌసల్య జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం మాధవీలక్ష్మి తెలిపారు. వీరు కాకినాడలో జూన్ 12 నుంచి 15 వరకు జరిగిన కబడ్డీ ఫెడ రేషన్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ చూపి జాతీయ స్థాయి కి ఎంపికైనట్టు పేర్కొన్నారు. రాజస్థాన్‌లో జూలై 10 నుంచి 13 వరకు జరిగే కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆమె పీడీ విజయలక్ష్మి, విద్యార్థినులను అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

పెళ్లకూరు : మండలంలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. విజయవాడకు చెందిన మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యులు తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. ఆదివారం తిరుగు ప్రయాణమయ్యారు. పెళ్లకూరు మండలం పెన్నేపల్లి వద్ద కారు అదుపుతప్పి ఐరన్ డివైడర్‌ను ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న తొమ్మిది మందిలో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి, అలాగే తిరుపతి నుంచి నెల్లూరుకు సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ చిల్లకూరు వడ్డిపాళెం వద్ద డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వారిని స్థానికులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

వృద్ధులను ప్రేమతో చూసుకోవాలి


అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి

గూడూరు రూరల్ : వృద్ధులను ప్రేమతో చూడాలని గూడూరు ఏడో అదనపు జిల్లా జడ్జి వెంకటనాగపవన్ తెలిపారు. గూడూరు రూరల్ పరిధిలోని పోటుపాళెం గ్రామంలో ఆదివారం వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ పెద్దలు కుటుంబాల కోసం అహర్నిశలు శ్రమపడి ఉంటారని తెలిపారు. అలాంటి వారి పట్ల కొంత మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ బాధలకు గురి చేస్తుంటారని తెలిపారు. బాధలు పడుతున్న వారికి పలు చట్టాలు అండగా న్నాయని గుర్తు చేశారు. ఎవరైనా సహాయం కోసం కోర్టుకు వస్తే న్యాయవాదిని ఉచితంగా ఏర్పాటుచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి రాజేష్, రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

అంకమ్మకు సామూహిక పొంగళ్లు


అంకమ్మకు పొంగళ్లు పెట్టేందుకు వస్తున్న మహిళలు

దక్కిలి : మండలంలోని శ్రీపురంలో వెలసిన అంకమ్మకు గ్రామస్తులు ఆదివారం సామూహిక పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ప్రతి ఏటా పంట కోతలు పూర్తయిన తర్వాత అంకమ్మకు పొంగళ్లు పెట్టడం ఆనవాయితీ. ఈ క్రమంలో ఆదివారం ప్రతి ఇంటి నుంచి మహిళలు బోనాలు తీసుకుని ఊరేగింపుగా పట్టణ నడిబొడ్డున ఉన్న అంకమ్మ మాను వద్దకు చేరుకున్నారు. అక్కడ పొంగళ్లు పెట్టారు. అనంతరం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

నాగార్పమ్మ..

ఓజిలి: మండలంలోని కురగొండ గ్రామదేవత నాగార్పమ్మకు గ్రామస్తులు ఆదివారం పొంగళ్లు పెట్టారు. ఉదయం అ మ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు.


ప్రత్యేక అలంకరణలో నాగార్పమ్మ

ముగిసిన ప్రసన్న వెంకన్న బ్రహ్మోత్సవాలు


లక్ష తులసి పూజలు చేస్తున్న భక్తులు

చిల్లకూరు : గూడూరు పట్టణంలోని రాజావీధిలో వెలసిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో పది రోజులుగా నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. లక్ష తులసి పూజలు, హోమం చేశారు. ఘనంగా పుష్ప యాగం చేపట్టారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారికి ఏకాంత సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా తలమంచి సిద్దారెడ్డి, రాజేశ్వరమ్మ వ్యవహరించారు. ఆలయ ఈవో రవిక్రిష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు శ్రీకంఠి రామోహన్‌రావు పర్యవేక్షించారు.

మూలనపడిన 108 వాహనం

ప్రమాదాల్లో గాయపడి సరైన సమయంలో వైద్యం అందక ఎంతోమంది క్షతగాత్రులు మృత్యువాతపడుతున్నారు. ఈ విషయాన్ని గమనించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 108 వాహనాన్ని తీసుకువచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారిని నిమిషాల్లో ఆస్పత్రికి చేర్చి వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నారు. కూటమి ప్రభుత్వం పేదల వైద్యం గురించి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ 108 వాహనాల గురించి పట్టించుకోవడం మానేసింది. దొరవారిసత్రం మండలానికి చెందిన 108 వాహనం మరమ్మతులకు గురై మూలన పడినా అధికారులు, పాలకులు పట్టించుకోలేదు. దీంతో క్షతగాత్రులకు సరైన సమయంలో వైద్యం అందక మృత్యువాతపడుతున్నారు.




డీవీ సత్రంలో మూలన పడిన 108 వాహనం, గాయపడి సకాలంలో వైద్యం అందక మృతి చెందిన వ్యక్తి(ఫైల్)

- క్షతగాత్రులకు సకాలంలో అందని వైద్యం
- గాలిలో కలిసిపోతున్న ప్రాణాలు
- పట్టించుకోని అధికారులు

దొరవారిసత్రం : మండలంలో 16 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఈ పరిధిలో ఎక్కడ రోడ్డు ప్రమాదాలు జరిగినా స్థానికంగా వున్న 108 వాహనానికి కాల్ వస్తుంది. ఇక్కడున్న 108 వాహనం మరమ్మతులకు గురై మూలన పడింది. దీంతో ప్రమాద స్థలానికి నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లోని 108 వాహనాలు రావాల్సి వస్తోంది. ఈ క్రమంలో క్షతగాత్రులను చికిత్స కోసం తరలించేందుకు సుమారు గంటకు పైగా సమయం పడుతోంది. దీంతో క్షతగాత్రులు ప్రాణాలు కోల్పోతున్నారు. గత నెల నుంచి ఇప్పటి వరకు నెలబల్లి, డీవీ సత్రం, తల్లంపాడు టోల్ ప్లాజా వద్ద రహదారిపై నాలుగు ప్రమాదాలు జరిగాయి. ఇందులో డీవీ సత్రంలో పది రోజులు కిందట రోడ్డు దాటుతున్న వ్యక్తిని వాహనం ఢీకొంది. కూతవేటు దూరంలో 108 వాహనం ఉండి కూడా ప్రయోజనం లేకుండాపోయింది. సూళ్లూరుపేట నుంచి 108 వాహనం వచ్చేసరికి గాయపడిన అతను మృతి చెందాడు. ఇలా అనేక సంఘటనలు జరుగుతున్నా అధికారులు, పాలకుల్లో చలనం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి క్షతగాత్రులకు సకాలంలో వైద్యం అందించేలా 108 వాహనాన్ని బాగు చేయించాలని కోరుతున్నారు.

నేడు పెంచలకోనలో మెగా యోగాంధ్ర

రాపూరు: మండలంలోని పెంచలకోనలో సోమవారం పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మెగా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ పాల్గొంటారని చెప్పారు. పెంచలకోనలో ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. మండలంలోని అధికారులు, సిబ్బంది, సచివాలయాల సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని కోరారు.